నీ గర్వం కొలదీ ఇది అంతా నేనే సాధించాను అంటే చివరకు నీ పని సున్న. ఈశ్వరుని దయ లేకుండా ఆ పని పూర్తి అవ్వదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-2010, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మతిని చూడు మతమును చూడవద్దు. నువ్వు ఎవరిని చూసినా వారి కులాన్ని మతాన్ని చూడకు, వారి మనస్సును చూడు. విత్తము చూడకు చిత్తాన్ని చూడు. అంటే వారి దగ్గర డబ్బులు ఎన్ని ఉన్నాయి అని చూడకు, వారి మనస్సు ఎటువంటిదో చూడు. అది కల్మషంతో కూడి ఉందా లేక పవిత్రంగా ఉందా అనేది చూడు. వాడి దగ్గర డబ్బు ఉంటే నీకెందుకు, అది నీకు రాదు కదా. వాడి మనస్సు పవిత్రం అయి ఉంటే వాడి దగ్గర నుండి మనం నేర్చుకోవచ్చు, వారి దగ్గర మనం కూర్చుంటే వారి దగ్గర నుండి వైబ్రేషన్స్ వస్తాయి, రమణ మహర్షిగారు ఒక సందర్భంలో ఏమని చెప్పారు అంటే నీ మనస్సు చెడుతలంపులకు అలవాటు అయిపోయి ఉంది, మంచితలంపులను తొందరగా తీసుకోదు. తల్లి చంటి పిల్లలను ఎత్తుకొని, బొమ్మలను చూపిస్తూ, వారిని మచ్చిక చేసుకొని చిన్న చిన్న అన్నం ముద్దలు ఎలా తినిపిస్తుందో అలాగ నువ్వు మనస్సును మచ్చిక చేసుకొని నెమ్మదిగా మంచి ఆలోచనలు దానికి తినిపించు, అంటే అలా నెమ్మదిగా అలవాటు చేస్తే కొంతకాలం తరువాత మంచి ఆలోచనలు, మంచి మాటలు దానికే వచ్చేస్తాయి.

ఇప్పుడు మనం చెప్పుకొనేవి మీటింగులు కావు, ఇది జ్ఞానయజ్ఞం. జీవితం అన్నాక ఏదీ రాకుండా ఎలా ఉంటుంది. ఒకోసారి కష్టం వస్తుంది, ఒకోసారి సంతోషం వస్తుంది, ఒకోసారి లాభం వస్తుంది, ఒకోసారి నష్టం వస్తుంది. ఈ ద్వంద్వాలను దాటిపోవటానికే జ్ఞాన యజ్ఞాలు. మీకు ఎంత డబ్బు ఉన్నా జ్ఞానయజ్ఞం చేసే ఉపకారం డబ్బు చేయలేదు, చదువు చేయలేదు. మనం బతకటానికి డబ్బు అవసరమే, చదువు అవసరమే, తెలివితేటలు అవసరమే కాని ఈ సబ్జక్టు ఎక్కడకు తీసుకొనిపోతుందో ఆ మూడు అక్కడకు తీసుకొని వెళ్ళలేవు. ఎందుచేతనంటే ధనం, చదువు, మీ తెలివితేటలు ఇవి అన్నీ ప్రకృతిలో భాగం. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఈ రోజు మీరు సంతోషంగా ఉన్నారు రేపు దుఃఖం రావచ్చు. మీకు ఏ మూల నుండి దుఃఖం వచ్చినా, సంతోషం వచ్చినా, అది మీ బంధువుల ద్వారా రానివ్వండి, స్నేహితుల ద్వారా రానివ్వండి. సమాజం ద్వారా రానివ్వండి, ఏ రకంగా వచ్చినా వాటి గురించి కంగారుపడకండి. అవన్నీ అబద్దాలు అని మీ మనస్సులో నిర్ణయించుకోండి. మీరు సమాజంలో నుండి కాని, ఇంద్రియ విషయాల నుండిగాని

ఏదైనా మీరు సంతోషం పొందుతూ ఉంటే అది నిజమని మీరు పొందుతున్నారు కాని అది అబద్ధం. దాని వలన వెంటనే దుఃఖం కూడా వచ్చేస్తుంది అని చెప్పాడు. మీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా కంగారు పడకండి, వస్తే రానివ్వండి, వాటితో కలిసిపోకండి, వాటితో జతకట్టవద్దు, వాటిని తీసి ఒక పక్కన పెట్టండి. మీరు సంతోషం వచ్చినప్పుడు సంతోషపడితే, దుఃఖం వచ్చినప్పుడు దుఃఖపడకుండా ఉండలేరు. అందుచేత అదీ వదిలేయాలి, ఇదీ వదిలేయాలి. అవి నిజం అనుకొని వాటితో కలిసిపోయి మీరు బాధపడుతున్నారు. అవి నిజంకాదు. అవి ఎంత నిజం అని మీరు అనుకొంటున్నారో ఆ గొడవలు అన్నీ అంత అబద్ధం.

మీ రమణమహర్షిగారు ఏమి చెప్పారండి అని కొంతమంది నాతో అంటూ ఉంటారు. ఆయన చెప్పినదంతా ఒక్క వాక్యంలో చెపుతున్నాను, భగవాన్ పుస్తకాల సారం అంతా ఈ వాక్యంలో చెపుతున్నాను, లెర్న్ టు బి నో మైండ్, మనస్సు లేకుండా ఉండటం నేర్చుకోండి అదే ఆయన చెప్పిన సిద్ధాంతం. మీరు వంట చేయటం నేర్చుకొంటున్నారు, లెక్కలు నేర్చుకొంటున్నారు, చాడీలు చెప్పటం నేర్చుకొంటున్నారు ఇలా లోకం గొడవలు అన్నీ నేర్చుకొంటున్నారు కదా అలాగే ఇది కూడా నేర్చుకోండి. మనస్సులేని స్థితిలో ఉండటం నేర్చుకోండి. అదే మీ జీవిత లక్ష్యం. అది నేర్చుకొంటే మీరు అమనస్కస్థితిని పొందుతారు. మనస్సు అసలు మీరు కాదు. కాని మనం మనస్సుతోటి తాదాత్మ్యం పొందటం నేర్చుకొన్నాము, అదే నేను అనుకోవటం అభ్యాసం అయిపోయింది. మీరు ఎన్ని యోగాభ్యాసాలు చేసినా, పూజలు చేసినా, ధ్యానాలు చేసినా మనస్సే నేను, ఈ శరీరమే నేను అనే ఈ రెండు తలంపులలో నుండి మీరు బయటపడకపోతే మీకు మోక్షం రాదు సరికదా చివరకు అల్లరి మిగులుతుంది. ఇక్కడ మనం తెలుసుకోవలసింది ఏమిటి అంటే శరీరం చనిపోతున్నప్పుడు నేను చనిపోతున్నాను అని శరీరం అనుకోదు, మనస్సు అనుకొంటుంది. మనం మనస్సులేని స్థితికి వెళ్ళాము అనుకోండి అప్పుడు శరీరం చనిపోతున్నప్పటికీ నేను చనిపోతున్నాను అని వాడు అనుకోడు ఎందుచేతనంటే మనస్సులేని స్థితిని పొందినప్పుడు లోపల ఏ సత్యవస్తువు అయితే ఉందో అది తాను అవుతాడు. ఆ వస్తువుకు చావు లేదు కాబట్టి తనకు చావు లేదని వాడికి తెలుస్తుంది.

మనకు ఏదైనా రోగం ఉంది అనుకోండి, ఆ రోగం ఉందని మనకు తెలిస్తే దానిని తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేస్తాము. అలాగే మనలో ఏవైనా పొరపాట్లు ఉంటే, బలహీనతలు ఉంటే అవి మనలో ఉన్నట్లు మనకు తెలిస్తే వాటి నుండి బయట పడటానికి తప్పనిసరిగా ప్రయత్నం చేస్తాము. మనం ప్రయత్నం మొదలుపెడితే ఈశ్వరుని

అనుగ్రహం కూడా మనకు వస్తుంది. అందుచేత మనలో ఏ బలహీనతలు ఉన్నాయి అనేది ముందు మనకు తెలియాలి. నువ్వు యుద్ధం చెయ్యి, నీ చేతిలో ఉన్న పనిని విడిచిపెట్టి పారిపోవద్దు, నీ చేతిలో ఉన్న పని చెయ్యి అని కర్మయోగాన్ని పరమాత్మ బోధించాడు, మనం కూడా అలాగే ఉండాలి కదా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. దానికి భగవాన్ ఏమనిచెపుతున్నారు అంటే నువ్వు పని చెయ్యి, నేను చేస్తున్నాను అనే తలంపు లేకుండా చెయ్యి. మీరు ఎక్కడో గోడ కట్టించారు అనుకోండి. మీరు అంతటివారు, ఇంతటివారు అక్కడ గోడ కట్టించారు అని ఎవరైనా అంటే మీరు పైకి బిగపెట్టుకొని కూర్చొన్నా లోపల సంతోషించారు అనుకోండి మీకు కర్తృత్వం ఉందని అర్థం. నువ్వు పని చెయ్యవచ్చు. ఏ రకంగా పని చేస్తే ఆ పని నిన్ను బంధించదో ఆ రకంగా పని చెయ్యాలి. అంటే కర్తృత్వం లేకుండా, అహంభావన లేకుండా పనిచెయ్యటం నేర్చుకోవాలి. అది మనస్సు లేని స్థితికి వెళ్ళినవాడికి సాధ్యం కాని అక్కడ మనస్సు పెట్టుకొని నేను కర్తృత్వం లేకుండా చేస్తున్నాను అని చెప్పినా అలా సాధ్యం కాదు. నువ్వు కర్మ చెయ్యి, కర్తలేని కర్మచెయ్యి. నువ్వు ఒక వ్యక్తివి అనుకోవద్దు, ఈశ్వరుడి చేతిలో పని ముట్టుగా ఉండు. ఈశ్వరుని పాదాలయందు నీకు నిజంగా భక్తి కుదిరితే నువ్వు మనస్సు లేని స్థితికి వెళ్ళిపోతావు అంటే పునర్జన్మను తీసుకొని వచ్చే కారణాలు అన్నీ కాలిబూడిద అయిపోతాయి.

మన శరీరం ఎక్కడ ఉందో మనస్సు కూడా అక్కడే ఉండాలి. కాని మనకు శరీరం ఇక్కడ ఉంటుంది మనస్సు భీమవరంలో ఉంటుంది. మనకు చపలత్వం అలవాటు అయిపోయింది అందుకే మనకు పునర్జన్మలు పెరిగిపోతున్నాయి. మన శరీరం ఏ పని అయితే చేస్తోందో ఆ పని మీదే మన మనస్సు ఉండాలి. యోగః కర్మసు కౌశలం అంటే మామూలుగా అర్థం నువ్వు చేసే పని లోపాలు లేకుండా పెర్‌ఫెక్టుగా చేయటమే యోగం. స్థూలంగా చూస్తే ఇది బాగానే ఉంది కాని కౌశలం అంటే నేర్పు అంటే నువ్వు చేసిన కర్మ నిన్ను బంధించకూడదు. నువ్వు చేసిన కర్మ నిన్ను బంధించకుండా ఈ పని నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయటమే యోగం. ఆ యోగం వలన నువ్వు అమనస్కస్థితిని పొందుతావు. నేను క్షరానికి, అక్షరానికి అతీతుడను అని పరమాత్మ చెప్పాడు. క్షరం అంటే నశించేవి. శరీరం చనిపోవటం మనం చూస్తున్నాము కదా, శరీరం ఎలాగు క్షరమే. జీవుడు కూడా క్షరమే అన్నారు ఆచార్యులవారు. మీకు ఆత్మజ్ఞానం కలిగేవరకూ జీవుడు నిజం, ఆత్మ జ్ఞానం వస్తే జీవుడు పత్తాలేకుండా పోతాడు. అప్పడు ఈ శరీరం ఎంత అబద్ధమో జీవుడు కూడా అంతే అబద్ధం. అంటే ఈ గొడవలు అన్నీ క్షరమే. ఈ ప్రపంచం గోలకు ఆయనకు

సంబంధం లేదు, వీటి అన్నింటికి అతీతంగా ఉన్నాడు, వాడు పరమాత్మ.

ఆచార్యులవారు ఏమన్నారు అంటే మీరు భగవద్గీతలో ఉన్న అధ్యాయాలన్నీ చదవలేకపోతే 15వ అధ్యాయం నోటికి వచ్చేలాగ చదువుకోండి అని చెప్పారు. అది పురుషోత్తమ ప్రాప్తియోగం. పురుషోత్తముడిని ఎలా పట్టుకోవాలో చెప్పే యోగం. గీతసారం అంతా అందులో ఉందని ఆచార్యులవారు చెప్పారు. ఇప్పుడు మనకు సహనం తగ్గిపోయింది. గీత అంతా డీటైల్‌గా చదివేశక్తి, సమయం మీకు లేకపోతే 15వ అధ్యాయం మటుకు బాగా నోటికి వచ్చేలాగ, ఆ శ్లోకాల అర్థం మీకు జ్ఞాపకం వచ్చేలాగ అధ్యయనం చేయండి అని ఆచార్యులవారు చెప్పారు.

ఈ దేహాన్ని నేను అని నువ్వు అనుకొన్నా, ఈ దేహానివి నువ్వు కాదు. అది నావల్ల అయ్యింది, ఇది నావల్ల అయ్యింది అంటావు. మీ ఇంట్లో ఎవరైనా బాగుపడితే వారిని నేనే బాగుచేసాను అంటావు. మీ ఇంట్లో ఎవరైనా పాడైపోయారు అనుకో, మరి వారిని ఎవరు పాడుచేసారు అది చెప్పండి. వారిని నేనే పాడుచేసాను అని మీరు చెప్పరు, అది మీ గౌరవానికి భంగం. ఈ అహంకారానికి దాని వేషాలకు మరల గౌరవం ఒకటికావాలి. ఎవరైనా బాగుపడితే మేమే బాగుచేసాము అంటారు, ఎవరైనా పాడైపోతే అది మాకు తెలియదు అంటారు. ఇటువంటి దొంగవేషాలు అన్నీ మనస్సే వేస్తుంది. ఈ బాధలు అన్నీ మీరు పడలేరు, నో మైండ్ స్టేట్‌కి వెళ్ళండిరా. ఈ చావులు, పుట్టుకలు, సంసారం గొడవలు ఇవన్నీ మీరు పడలేరు. మనస్సు లేని స్థితికి వెళ్ళండి. లెర్న్ టు బి నో మైండ్.

ప్రతీవాడు ఏమనుకుంటున్నాడు అంటే వాడికి తెలివితేటలు లేకపోయినా నేను తెలివైనవాడిని అనుకుంటున్నాడు. భగవంతుడు కల్పించిన ఈ సృష్టిలో మనకు తెలుసున్న విషయాలు బహుతక్కువ, తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయని రామకృష్ణుడు చెప్పాడు. ఈశ్వరుడు ఒక్కడే సర్వజ్ఞుడు. ఇసుకను చేత్తో తీసుకుని అందులో ఎన్ని రేణువులు ఉన్నాయి అంటే మీరు ఎవరూ చెప్పలేరు, అది మానవుడు ఎవడికి సాధ్యం కాదు, ఈశ్వరుడు చెపుతాడు, వాడే దేవుడు. కార్ల్‌మార్క్స్ మతాన్ని నల్లమందు అన్నాడు. భగవాన్ ఏమన్నారు అంటే మీరు వ్రతాలు చేసుకోండి, యాత్రలకు వెళ్ళండి, పూజలు చేసుకోండి చనిపోయాక స్వర్గానికి వెళతారు అని మతం చెపుతోంది, అది రైటే అనుకొందాము మరి బతికి ఉండగా మీ మాట ఏమిటి. ఇప్పుడు మీరు నరకంలో ఉంటారా? మతం అనేది భవిష్యత్ గొడవులు చెపుతోంది. ప్రస్తుతం వర్తమానకాలంలో మీమాట ఏమిటి? అంటే యిప్పుడు నరకంలో ఉండమనా. ఇప్పుడు మీకు చెక్కు ఇచ్చి మీరు చనిపోయిన తరవాత చెల్లుతుంది అని

అంటే ఆ మాటకు అర్థం ఏమిటి? మీరు ఇది చేసుకోండి, అది చేసుకోండి తరువాత ఏదో వచ్చేస్తుంది అనటం ఏమిటి? చనిపోయిన తరువాత ఏదో వచ్చేస్తుంది అని అందరూ కనిపెట్టుకుని ఉంటున్నారు, ఏమీ రాదు సున్నా అంటున్నారు భగవాన్. చనిపోయిన తరువాత మీ శరీరం మారుతుంది కానీ మీ మనస్సు అలానే ఉంటుంది. మీరు మంచి చేసుకొంటే చేసుకోండి, మంచి చేసుకోవద్దు అనటంలేదు. మీరు చనిపోయిన తరువాత ఏదో వచ్చేస్తుందని అనుకొంటున్నారు. ఒకవేళ మీరు మంచి పనులు చేస్తే పుణ్యలోకానికి వెళ్ళవచ్చు కానీ మీ చైతన్యస్థాయి ఏమీ పెరగదు. ఇక్కడ మీరు చూడవలసింది ఏమిటంటే మీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. చీకటి ఎలా ఉంటుందో, దుఃఖం ఎలా ఉంటుందో, వేరుబుద్ధి ఎలా ఉంటుందో దానికి తెలియదు. శరీరంలో ఉన్నా అది శరీరానికి పరిమితమై ఉండదు. జాతి, మతభేదం ఏమీ దానికి ఉండవు. ఆ స్థాయికి చేరుకొంటే గాని అది నీకు అనుభవంలోనికి రాదు. ఆ వస్తువు తాలూకా అనుభవం మనం పొందాలి, అదే మన గమ్యం. నీ మనస్సు తోటి, నీ శరీరంతోటి, ప్రపంచంతోటి నువ్వు అతిగా తాదాత్మ్యం పొందుతున్నావు. ఇంక ఆ వస్తువు తాలూకు అనుభవం ఎలా కలుగుతుంది.

పెళ్ళి చేసుకుంటే సంసారం వస్తుంది. సంసారం వచ్చాక వాడికి తప్పు చేయటం ఇష్టంలేకపోయినా సంసారం నడవటానికి ఏవో తప్పులు చేస్తుంటాడు. కుటుంబ పరిస్థితులు వాడిచేత తప్పలు చేయిస్తాయి. ఈ జగత్తులో మనం మహర్షులు అనుకునేవారు, యోగులు అనుకునేవారు చిన్నతప్పు చేయకుండా ఎవడైనా ఉన్నాడా అన్నారు వేమనామాత్యుడు. రామాయణం వ్రాసిన వాల్మీకి కూడా ఎన్నో దొంగతనాలు, హత్యలు చేసాడు. వాల్మీకి నారదుడిని కూడా దోచుకోవటానికి చూసాడు, ఆయన మహర్షి అని వాల్మీకికి తెలియదు. ఇవన్నీ ఎవరికోసం చేస్తున్నావు నీపొట్టకోసం యిన్ని దొంగతనాలు చేయాలా అని అడిగాడు. తరువాత నారదుడితో సహవాసం వచ్చాక ఆయన జీవితవిధానంలో మార్పువచ్చేసింది, ఆయనచేత రామాయణం రాయించాడు నారదుడు. అది సత్పురుషుల సహవాసం వలన వచ్చే లాభం, చావుపుట్టుకలతో సంబంధంలేని సద్వస్తువు మీ హృదయంలో ఉంది. ఇంత సమీపంలో ఉన్న వస్తువును తెలుసుకోవటం మానేసి ఏది తెలుసుకొన్నాక శాంతి, ఆనందం, జ్ఞానం ఉండటం అనేవి మీకు స్వరూపంగా వ్యక్తమవుతాయో దాన్ని తెలుసుకోవటం మానేసి, దాని గురించి సాధన చేయటం మానేసి ఎప్పడో, ఎక్కడో, ఏదో వస్తుందని ఈ మనస్సును అక్కడకు పంపేస్తున్నారు ఇది మాయ కాకపోతే ఏమిటి అన్నారు భగవాన్. మతం ఏమి చేస్తోంది అంటే వర్తమానకాలాన్ని వదిలేసి మనలను ఎక్కడికో తీసుకొనిపోతోంది.

భగవంతుడు చెప్పిన మాట ఇప్పడు ఎంత నిజమో లక్ష సంవత్సరాల తరువాత కూడా అంతే నిజం, అది నిత్యసత్యం. అయితే కార్ల్‌మార్క్స్ చెప్పనివ్వండి, మరో శాస్త్రవేత్త చెప్పనివ్వండి అవి అన్నీ కొంతకాలం నిజం కింద మనకు అనిపిస్తాయి. తరువాత కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి ఎందుచేతనంటే, అవి డివైన్ మైండ్ నుండి వచ్చినవి కాదు. హ్యూమన్ మైండ్‌కు పరిమితులు ఉంటాయి, అది కొంతదూరమే చూడగలదు.

పిల్లలు బడికి వెళ్లను అంటే మీకు మైసూర్‌పాక్ పెడతాను, చాక్‌లెట్లు పెడతానని వాడికి ఏవో లంచాలు ఇచ్చి వాడిని బడికి పంపుతాము. అలాగే మతం మొత్తం మీద మీచేత కొన్ని పుణ్యకార్యాలు చేయిస్తోంది, అంటే మంచిదే, దానివలన కొంత పుణ్యం వస్తుంది. అలా చెప్పకపోతే ఇప్పడు మీరు చేసే మంచిపనులు కూడా మీరు చెయ్యకపోవచ్చు. అది కాదనటంలేదు, కాని ఇవన్నీ వ్యవహారికసత్యాలు. ఈ శరీరం పుట్టకముందు ఎక్కడ ఉన్నాము, చనిపోయిన తరువాత ఎక్కడికి వెళతాము ఈ గొడవలు అన్నీ వదిలేసి నువ్వు వర్తమానకాలంలో చేయవలసింది ఏమిటి అంటే డైరెక్టుగా నీహృదయంలో ఉన్న సత్యవస్తువు తాలూకు ఎరుక సంపాదించడానికి ప్రయత్నం చెయ్యి, జరిగిపోయిన గొడవలు అస్తమానూ తలపెట్టు కొంటూ నీ మనస్సును పుండు చేసుకోవద్దు. ఎక్కడైతే మీశరీరం ఉందో అక్కడే మీ మనస్సును పెట్టి మీరు చేసే సాధన ఏకాగ్రంగా చేసుకోండి. మీ లోపలే బంగారం పెట్టుకొని యాత్రలకు వెళ్లి పెంకుముక్కలు తెచ్చుకొంటారా అంటే పుణ్యక్షేత్రాలకు వెళ్లవద్దు అనికాదు. లోపల ఉన్న వస్తువును తెలుసుకోవటానికి డైరెక్టుగా సాధన చెయ్యటం మానేసి ఏవో వంపులు పెట్టుకొని ఇలా తిరుగుతున్నాము. డబ్బు ఉంటే కాశీ వెళ్లిరావటం తేలికే కానీ అన్వేషించి, విచారణ చేసి లోపలఉన్న వస్తువును పట్టుకోవటం కష్టం. కర్తృత్వంలేని వాడికి దుఃఖం లేదు. నేను చేస్తున్నాను అనే తలంపు ఉంటే పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం నువ్వు అనుభవించాలి. నేను చేస్తున్నాను అనే తలంపు లేకుండా నువ్వు మూడు లోకాలను భస్మంచేసినా నీకు ఏమీ అంటదు అని పరమాత్మ చెప్పాడు. ఏది సత్యం ఏది అసత్యం, ఏది నిత్యం ఏది అనిత్యం, ఏ పని చేస్తే మనకు సుఃఖం వస్తుంది ఏపనిచేస్తే మనకు దుఃఖం వస్తుంది ఆ విచక్షణ సర్వ సాధారణంగా చాలామంది బ్రెయిన్‌లో ఉండదు.

భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మీకు ధనం ఉండవచ్చు, ఆస్తులు ఉండవచ్చు. మీకు ఎన్ని రకాల గొడవలున్నా అర్థబలం ఉన్నా, అంగబలం ఉన్నా నీకు వైరాగ్యం అనే సంపద లేకుండా నీకు జ్ఞానం రాదు. నిజమైన భాగ్యం వైరాగ్యమే. వైరాగ్యమనే భాగ్యం సంపాదించకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. మనం శరీరంతో చేసే తప్పలకంటే మనస్సుతో చేసే తప్పలు ఎక్కువ ఉంటాయి. వాటికి కూడా ఏదో రోజున మనలో ఉన్న అంతర్యామికి

సమాధానం చెప్పాలి. ఫలానా వ్యక్తికి చెడ్డ చేయాలి అని మనస్సులో తలంపు రావచ్చు, అది నువ్వు శరీరంతో చెయ్యకపోవచ్చు అయినా ఆ తలంపుకు కూడా నువ్వు భగవంతుడికి సమాధానం చెప్పాలి అంటే అన్నీ రికార్డు అయిపోతాయి. పరమేశ్వరుడికంటే పరమలోభి మెరుగు అనిచెపుతారు. మనకు వచ్చే మంచి తలంపులను, చెడు తలంపులను కూడా వదలకుండా పరమేశ్వరుడు రికార్డు చేసి ఉంచుతాడు, నువ్వు అన్నింటికి సమాధానం చెప్పాలి. మంచి తలంపుల వలన కొంత సుఃఖం, చెడుతలంపుల వలన కొంత దుఃఖం రావచ్చు, ఇవన్నీ కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి. ఏదో చెయ్యటంవలన ఏదో వస్తుంది కాని నారాయణుడు తెలియబడడు. మరి ఎలా తెలియబడతాడు అంటే నీ మనస్సు నిర్మలం అవ్వాలి, నిశ్చలం అవ్వాలి. లోపల ఉన్న అంతర్యామి ఎంత పవిత్రంగా ఉన్నాడో నీ మనస్సు అంత పవిత్రం అయితేనే అందులో ఐక్యం అవుతుంది కాని లేకపోతే నీ మనస్సు అందులో ఐక్యం కాదు. కర్తృత్వం లేకపోతే పనులు జరగవేమోనని మనందరికి భయం, అలా భయం అక్కర లేదు. ఋషులు, మహాత్ములు పనిచేసారు, రాముడు పనిచేసాడు. రాముడు అహంకారముతోటి పనిచేయలేదుకదా. అహంకారరహితస్థితికి వెళితే మనం కూడా రాముడిలాగా కృష్ణుడిలాగా పనిచేయవచ్చు. రాముడు చేసేపని రాముడుని చుట్టుకోదు. మనం కూడా అలాగ పనిచేస్తే ఆపని మనలను కూడా చుట్టుకోదు, అదేయోగం. మనందరిలో ఉన్నదోషం ఏమిటి అంటే ఫలితం ఎంత వస్తుందని ఆలోచించుకొనే పనిచేస్తాము. ఫలకాంక్ష ఉన్నవాడు ప్రతీవాడు కూలివాడే. మామూలుగా మీరు పని చెయ్యండి వచ్చేది వస్తుంది, రానిది రాదు. అహంకారం ఉన్నంత మాత్రంచేత ఎక్కువ ఫలితం రాదు, అహంకారం లేకుండా పనిచెయ్యటం వలన తక్కువ ఫలితం రాదు. వచ్చేది ఎలాగూ వస్తుంది. మనస్సు లేకుండా చేసే పని క్వయిట్‌గా ఉంటుంది, కూల్‌గా ఉంటుంది, కామ్‌గా ఉంటుంది. నో మైండ్ స్టేట్‌కు వెళ్ళినవారు కూడా పనిచేస్తున్నారు కదా, మీరు ఆ స్థితిని సంపాదించండి. ఆ స్థితిని సంపాదిస్తే మీ పని ఆగిపోతుంది అనుకోవద్దు. తల్లి కడుపులో నుండి మీ శరీరం బయటకు వచ్చినది మొదలు మరల స్మశానంకు వెళ్ళేవరకు మీ శరీరం ద్వారా ఏ పని జరగాలో ఆ పని జరిగిపోతూ ఉంటుంది. మీరు ఆ పని చెయ్యటం ఎంతమందికి ఇష్టం లేకపోయినా, మిమ్మల్ని ఎంతమంది ద్వేషించినా మీ శరీరం ద్వారా జరగవలసిన పని జరిగిపోతూ ఉంటుంది. ఈశ్వర సంకల్పం బలీయమైనది. ఆయన సంకల్పం ముందు మన సంకల్పాలు ఆగవు. మనం ఏమీ తప్పలు చేయకూడదు అనుకొంటాము కాని తప్పలు చేస్తున్నాము కదా మరి మీ తెలివితేటలు ఏమయ్యాయి, మీ ప్రయత్నం ఎక్కడికి వెళ్ళింది. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, ఆయన సంకల్పం ప్రకారమే ఈ సృష్టి అంతా

నడుస్తోంది. అందుచేత ఆయన పాదాలను ఆశ్రయించండి. ఆయనే కర్మఫలదాత, లోకం బయట మనం చేసే పనిని చూస్తుంది కాని పరమేశ్వరుడు అలా కాదు. ఆ పని చేసేటప్పుడు నీ మనస్సు ఎలా ఉంది అని ఆయన చూస్తాడు, దానిని బట్టి నీకు స్పిరిట్యువల్ స్టేటస్ వస్తుంది.

జీవుడు దేవుడు, ద్వైతం అద్వైతం అని ఎందుకు కొట్టుకొని చస్తున్నారు మీకు స్వార్థం ఉంటే జీవుడు, స్వార్థం లేకపోతే వాడే దేవుడు అని స్వామి వివేకానంద ఒకసారి చెప్పారు. మీకు దేహభావన ఉన్నప్పుడు స్వార్థం వచ్చి తీరుతుంది. పెళ్ళి అయ్యింది అంటే ప్రమాదం వచ్చి మీద పడుతుంది, ఎంతోకొంత స్వార్థం తప్పదు. పెళ్ళానికి మొగుడు మాయ, మొగుడికి పెళ్ళం మాయ, ఇద్దరికీ కలిసి డబ్బు మాయ అన్నాడు రామకృష్ణుడు. ఒకవేళ ఈ మాటలు మీరు నమ్మకపోయినా ప్రాక్టికల్‌గా మీరు కూడా చూడండి. లెర్న్ టు బి నోమైండ్. నో మైండ్ స్టేట్‌కి వెళితే మీరు పనులు చెయ్యలేరు అనుకోకండి. మీ శరీరం ద్వారా భగవంతుడు ఏ పని అయితే నిర్దేశించాడో మీరు మనస్సు లేని స్థితికి వెళ్ళిన తరువాత కూడా ఆ పని అయిపోతూ ఉంటుంది. అయితే పని చేస్తున్నాము అనే భావన ఉండదు. మనస్సు ఉంటే భావన ఉంటుంది. రామకృష్ణుడు, రమణుడు వాళ్ళు పనులు చేసారు కదా, వారు మాట్లాడారు కదా. వారు గ్రేట్ టీచర్స్ కదా. మరి ఆ టీచింగ్ అహంకారంతోటి చేసారా? వారు అహంకారముతో టీచ్ చేస్తే ఆ టీచింగ్ శతాబ్దాల తరబడి ఉండదు. అహంకారం లేకుండా మీరు ఒక్క మాట మాట్లాడితే సూర్యుడు, చంద్రుడు ఎంతకాలం ఉన్నారో అంతకాలం ఆ మాట ఉంటుంది. ఏ మహర్షిగాని, యోగిగాని మీరందరు నా దగ్గరకు రండి అని జనాలను ఎవరినీ అడగలేదు. ప్రతీ రాజకీయనాయకుడికి జనాన్ని పోగుచేసుకొని వెళ్ళటమే. ఏ మహాత్ముడు అయినా జనాన్ని పోగుచేసుకొన్నాడా, ఏమీ లేదు. పంచదార దగ్గరకు చీమలు చేరినట్లు ఆయనకు ఉన్న జ్ఞానం చేత ఇతరులు ఆకర్షింపబడతారు. అది జ్ఞానం యొక్క వైభవం. ఏ రాజకీయ నాయకుడి దగ్గరకు స్వచ్ఛందంగా ఎవడూ వెళ్ళడు. వాడికి అధికారం ఉంటే ఏవో పనులు కోసం జనం వెళతారు. రాజకీయనాయకుల మీటింగులకు పార్టీలు డబ్బు ఖర్చుపెట్టి జనాన్ని తోలుకొని వెళ్ళటమే. ఏ మహర్షి అయినా మీరందరూ నా దగ్గరకు రండి అని పిలిచాడా, లేదు. అసత్యానికి ప్రచారం ఉండాలి కాని సత్యానికి ప్రచారం అక్కరలేదు.

మీరు డబ్బుకి ఎంతోకొంత శక్తి ఉందని అనుకొంటున్నారు, అధికారానికి ఎంతో కొంత శక్తి ఉందని అనుకొంటున్నారు, మీకు అంగబలం ఉంటే ఎంతో కొంత శక్తి ఉందని అనుకొంటున్నారు, ఈ అన్ని శక్తుల కంటే వెయ్యి రెట్లు గొప్పది జ్ఞానం యొక్క శక్తి. అది

మరిచిపోకండి. ఎక్కడైతే జ్ఞానం ఉందో అక్కడ వెలుతురు ఉంటుంది, అక్కడ శాంతి ఉంటుంది, అక్కడ శక్తి ఉంటుంది. మీకు పది మంది ఓట్లు వేసి, ఎవరైనా పదవి ఇస్తే మీకు ఎంతో కొంత శక్తి వచ్చినప్పుడు హృదయంలో ఉన్న సత్యవస్తువు తాలుక అనుభవం పొందినప్పుడు వాడు శక్తి లేకుండా ఎలా ఉంటాడు. మీకు వచ్చిన పదవులు తాత్కాలికం, అది పోతే మిమ్మల్ని పలకరించేవాడు ఉండడు. జ్ఞానియొక్క శక్తి అటువంటిది కాదు. రామకృష్ణుడి శరీరం ఇప్పుడు లేదు అయినా ఆయన శక్తి ఈనాటికి కూడా పని చేస్తోంది, రమణమహర్షిగారి శరీరం ఉండగా లాభం పొందినవారికంటే ఆయన శరీరం పోయిన తరువాత లాభం పొందిన వారు ఎక్కువ మంది ఉన్నారు. ఎందుచేతనంటే అక్కడ పని చేసేది శరీరం కాదు, చైతన్యం పనిచేస్తోంది. శరీరానికి మరణం ఉంది కాని ఏదైతే మిమ్మల్ని అనుగ్రహిస్తోందో, ఏదైతే మీలో మారు మనస్సు తీసుకొని వస్తోందో దానికి మరణం లేదు అందుచేత శరీరం మరణించినా అది పని చేస్తూనే ఉంటుంది. జ్ఞాని దగ్గరకు డబ్బులు ఇచ్చి జనాన్ని తీసుకొని రావలసిన అవసరం లేదు. వాడు లక్షమంది మధ్యలో కూర్చొన్నా, ఇంటిలో ఒంటరిగా కూర్చొన్నా వాడికి ఏమీ అనిపించదు ఎందుచేతనంటే వాడు నేనుగా లేడు, తానుగా ఉన్నాడు. అందుచేత లక్ష మంది మధ్యలో కూర్చొన్నప్పుడు ఇంతమంది జనంలో కూర్చొన్నానని అనుకోడు ఎందుచేతనంటే వాడికి ఇతరులు లేరు. ఒంటరిగా కూర్చొన్నప్పుడు నాకు కాలక్షేపం అవ్వటంలేదు, నన్ను చూడటానికి ఎవరూ రావటం లేదు అని అనుకోడు. ఎందుచేతనంటే అక్కడ జనం ఉన్నప్పుడు కూడా ఆ జనం వాడికి ఇతరులుగా కనబడరు, తానుగానే కనిపిస్తారు.

రమణమహర్షిగారు చెప్పినమాట మీరు బాగా గుర్తుపెట్టుకోండి. మీ శరీరం కంటే, మీ మనస్సుకంటే, మీ ఇంద్రియాలకంటే అత్యంత సమీపంలో మీ హృదయంలో సత్యవస్తువు ఉన్నప్పటికీ దానిని తెలుసుకోవటానికి చిన్న ప్రయత్నం కూడా చేయకుండా చనిపోయిన తరువాత ఏమౌతాము అంటే ఆ ప్రశ్నలు అర్థం లేని ప్రశ్నలు. నువ్వు చనిపోయిన తరువాత ఏమీ అవ్వవు. ఇప్పుడు ఎలాగ ఉన్నావో అలాగే ఉంటావు. చనిపోయిన తరువాత ఏదో వచ్చేస్తుంది అని కనిపెట్టుకొని ఉండకండి, ఏదీరాదు. ఈ శరీరం ఉండగానే కష్టపడి సాధన చేసి, శాస్త్రాన్ని అధ్యయనం చేసి దానిని అర్థం చేసుకొని, మహాత్ములను ఆశ్రయించి వారు చెప్పింది జీర్ణం చేసుకొని ఆ రకంగా జీవించి మీరు మారుమనస్సు పొందండి అంతేగాని చనిపోయిన తరువాత మారుమనస్సు వస్తుందని కనిపెట్టుకొని ఉండకండి అని చెప్పారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జనవరి | 14 | చెరుకుమిల్లి, ఉదయం గం॥ 10-00లకు |
| ఫిబ్రవరి | 17 | కైకలూరు, టిటిడి కళ్యాణ మండపం |
| ఫిబ్రవరి | 21 | భీమవరం, శివ కళ్యాణ మండపం |
| మార్చి | 6 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |
| మార్చి | 19 | చించినాడ, గీతామందిరం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# విలువైనది కాలం

ఆత్మ జ్ఞానాన్ని పొందుటకు అరుదైన కానుకగా లభించిన ఈ మానవ జీవితం 'కాల' రూపంలో ఉంది. బంగారంలోని ప్రతి చిన్న ముక్కకు విలువ ఉన్నట్లే, జీవితంలో ప్రతిక్షణం ఎంతో విలువైనది. పరమాత్మ కాలరూపంలో ఉన్నాడు, కాబట్టి కాలాన్ని సద్వినియోగం చేసుకోవడమే, పరమాత్మకు మనం సమర్పించే 'అలంకరణ' మరియు 'పూజ' అవుతుంది. మనము ఎక్కువకాలం జీవించాలని కోరుకుంటాం, కాని అర్థవంతంగా జీవించాలని కోరుకోం! మనము ఒక కాలంలో ఈ భూమి మీదకు వచ్చాము కాబట్టి, ఏ పని నిమిత్తం వచ్చామో ఆ పనిని మర్చిపోకూడదు. చిత్తశుద్ధి, శ్రద్ధ, సరియైన అవగాహన, నిజాయితి, వివేక వైరాగ్యములతో శ్రమించి, జీవితం అన్ని కోణాలలోనూ వికసించునట్లుగా మానసిక పరిణితిని పెంపొందించుకొని, తద్వారా జీవిత గమ్యాన్ని చేరాలి. కాలం ఏమి తీసుకొస్తుందో, కాలగర్భంలో ఏమి దాగుందో చెప్పలేము. జీవితంలోని ప్రతిసంఘటన, సందర్భము అంతిమ లక్ష్యాన్ని చేరుకోడానికి ఒక సోపానం కావాలి. గతించిన కాలం తిరిగిరాదు. మన చేతిలో ఉన్నది వర్తమానకాలమే. ఈ వర్తమాన కాలమే భవిష్యత్తుకు దారి చూపుతుంది. పరమాత్మ మనకు ప్రసాదించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి, లేని వాటి గురించి చింతించకూడదు. లక్ష్యసాధనకు చిత్తశుద్ధితో ముందుకు సాగి జీవితాన్ని సార్థకం చేసుకున్నప్పుడే మానవ జన్మకు సాఫల్యం.

- **చావలి సూర్యనారాయణమూర్తి,** టీచర్, అమలాపురం

# భ్రాంతి ఉన్న చోట - శాంతి ఉండదు

మనస్సుకు శరీరానికి అవినాభావ సంబంధం ఉంటుంది. మనస్సే ఇంద్రియాలతో విషయ భోగాలు అనుభవించాలని కోరుకొంటుంది. కొన్ని తీరినా అంతులేని అసంతృప్తి బయలుదేరుతుంది దానితో బుద్ధివక్రమైపోతుంది. దీనికి విరుగుడు కోరేకోర్కెలు ఏమిటి? నేను ఎవడను? కనబడే ప్రపంచం ఏమిటి? అనుకొంటే విషయం విధితమౌతుంది. భార్య యొక్క మాంసాస్థిర పంజరంపై విశ్వాసం పెట్టుకోకూడదు. అంతర్గతమైన దైవం ముందు విశ్వాసం పెట్టుకోవాలి. శరీరాన్ని మాయ తెరగా చూడాలి. ఏ క్షణంలో మనస్సు మలినం చేసుకొంటుందో ఆ క్షణమే ప్రకృతి తన కార్యాన్ని మొదలుపెడుతుంది. మలిన మనస్సు ఉన్నంతకాలం మలినాలతో ఆడుకోకుండా ఉండలేము. మనస్సు ప్రేమ, మైత్రి, కరుణతో, సద్భావనతో నిండి ఉండాలి. కామం చెడ్డదికాదు. దానివల్లనే మానవుడిగా జన్మించాము. దాని మూలంగానే దేవునిగా పరివర్తన చెందుతాము. కాని కామాన్ని సాధకుడు క్రియలో పెట్టుకోకూడదు. ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే కామం బలహీనతలకంటే బలహీనమైనది, అధమమైనది, దానితో వెయ్యిసార్లు పోరాడి పరాజితుడైనా కామంతో పోరుకు సిద్ధంగా ఉండాలి. ఇంద్రియ గోచరమైన ఈ ప్రపంచము కేవలం భ్రమ అని శాస్త్ర ఆధారంతో యుక్తితో బుద్ధి తెలుసుకోవాలి. ఈ శరీర తాదాత్మ్యము ప్రాపంచిక భోగాలను ఎక్కువ చేసి అహంకారాన్ని పటిష్టం చేసి అజ్ఞానాన్ని పెంచటానికి తోడ్పడుతుంది. దానికి నిర్లిప్తతే మందు. పెద్ద భవనాలు కట్టి, ధన కనక వస్తువాహనాదులను సంపాదించి మన కుటుంబాన్ని సంతృప్తి పరచటంపై మన దృష్టిని వినియోగించకూడదు. మన గమ్యం సత్యానుభవం దానిపైనే విశ్వాసం కలిగి ఉండాలి. బంధుమిత్రుల యొక్క, లౌకికుల యొక్క అభిప్రాయాలను పట్టించుకోకూడదు. వివేకానంద "అదృష్టం వేశ్య వంటిది అది నీవు కావాలి అనుకొంటే పారిపోతుంది. నీకు ఆశక్తి లేకుంటే నిన్ను వెంటాడుంది" అన్నారు. ఆలోచలను మనం అధికమించాలి. ప్రకృతి అన్నది దైవాన్ని ఆవరించిన ఒక తెర దాన్ని ప్రక్కకు తీస్తే జీవిత సత్యంతో పరిచయమౌతుంది. బ్రహ్మత్వం అనేది ఎక్కడో మనం వెదకనక్కరలేదు. మన చుట్టూ మనం అల్లుకొన్న విషయవాసనలు అనే పట్టుదారాల గూళ్ళను తెంపటమే. సముద్రంలో అలలు పైపైనే ఉండి కల్లోలంగా ఉంటూ లోపల గంభీర ప్రశాంత ఉంటుంది. అలాగే మనస్సు స్వస్థానం చేరితే కాలం, ఆలోచనల ప్రశ్న ఉండదు అంటారు పెద్దలు. దాన్ని గురు అనుగ్రహంతో ప్రయత్నించి సాధిస్తే అంతా శాంతే-సుఖమే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**